క్లుప్తంగా

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మోరె వేణుగోపాల్ రెడ్డి తల్లి మోరె శాంతమ్మ శుక్రవారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకుడు మోరె రవీందర్‌రెడ్డి ఉన్నారు.

శభాష్ కిష్టాపూర్ ఓటర్లు

కొత్తగూడ: మండలంలోని మారుమూల గ్రామం కిష్టాపూర్ ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకుని శభాష్ అనిపించుకున్నారు. గ్రామంలో 196 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 10 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. మిగతా 186 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అధికారులు గ్రామస్తులను అభినందించారు. అందరు ఇదే మాదిరిగా తమ హక్కును వినియోగించుకుంటే నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని చర్చ జరుగుతుంది.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బచ్చన్నపేట: ఆరోగ్య వంతమైన శిశువుకు జన్మనివ్వడానికి గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతులకు వివాహం అయినప్పటి నుంచి ప్రసూతి వరకు అండగా నిలుస్తుందన్నారు. వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులను కూడా అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తుదన్నారు. గర్భిణులు ఆయా గ్రామాల ఆశల వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని ప్రతి నెల ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రవళిస్టెల్లా, సృజన, సూపర్‌వైజర్లు అన్నాంబిక, జంగయ్య, సిబ్బంది శ్వేత, బొడ్డు శ్రీనివాస్, లత, లలిత ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం



పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో 20వేల మెజార్టీతో విజయం సాధిస్తామని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, సాంబయ్య శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు బీజేపీకి ఓటేసి గెలిపించేందుకు కృషి చేశారని అన్నారు. ఉచిత వాగ్దానాలను నమ్మలేని పరిస్థితుల్లో ప్రజలు కేంద్రంలోని బీజేపీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, నాయకులు దుబాసి వెంకటస్వామి, బాసాని సోమరాజ్, ఏకు శంకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముచినిపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన కంచు రాజ్‌కుమార్ (35) అప్పుల బాధతో గత నెల 18న పురుగుల మందు తాగాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు హనుమకొండ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతినికి భార్య సరిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



అఫ్జల్ బీ (ఫైల్)

చెన్నారావుపేట: మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు షేక్ అఫ్జల్ బీ (105) శుక్రవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పలువురు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి కూతురు యాకూబీ, నుమడు షేక్ హాజీపాషా, మనుమరాళ్లు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు పాటుపడాలి



వాజేడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



టేకుమట్లలో..

వాజేడు: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలనకు పాటుపడాలని వైద్యుడు కొమరం మహేందర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు కొమరం మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖ చెప్పిన ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధికి దూరంగా ఉండాలని ఎయిడ్స్ రాకుండా ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని నినాదాలను చేశారు. కోటిరెడ్డి, శేఖర్, రజనీ కాంత్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

టేకుమట్ల: వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ డే సందర్భంగా డాక్టర్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన పేషంట్లకి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్మాఫాతిమా సిబ్బంది బుచ్చిబాబు, విద్యాసాగర్, కృష్ణారెడ్డి, సతీష్, రాజేశ్వరి, లావణ్య, పావని, సరిత, సారయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక రవీంద్ర భారతి పాఠశాలలో 2009–10 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నకిరబోయిన కుమారస్వామి, ఉపాధ్యాయులు శేషాద్రి మల్లయ్య, వీరగాని సత్యం, పసునూటి రమణయ్య, ఐరబోయిన భిక్షపతి, బండ నిరంజన్‌రెడ్డి, వైద్యుడు తిరుపతిరెడ్డి, కందగట్ల హరికృష్ణ, ఎర్ర రాకేష్‌రెడ్డి, ప్రకాష్, విద్యార్థులు శ్రీకాంత్, ప్రశాంత్, రమేష్, శృతి, దివ్య, గీత, మహేష్, సింధుజ, రజిత, రాజు, కిరణ్, శ్వేత, వెంకటేశ్, రజనీకర్, సరిత, సాయిరాం పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలి



మద్యం షాపు ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్: మండలంలోని అంబాలలో గల మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్తులు, కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మద్యం షాపు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబాల ప్రధాన రహదారి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించిన మందుబాబులు రోడ్లపై మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో స్థానికంగా నివసించే మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉన్న కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కొందరు మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మద్యం దుకాణాన్ని ఎత్తి వేయాలని కోరుతూ ఆగస్టులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని, స్పందించిన కలెక్టర్ మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తీసేస్తామని చెప్పారని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని వెంటనే మరోచోటకు తరలించాలని కోరారు.

జోరుగా బియ్యం దందా!

- పక్క రాష్ట్రాలకు తరలుతున్న పీడీఎస్ రైస్
- పట్టించుకోని అధికారులు



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు (ఫైల్)

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. అక్రమార్కులకు మూడు పువ్వులు, ఆరు కాయల చందంగా మారింది. గ్రామాల్లోని ప్రజల వద్ద తక్కువ రేటుకు బియ్యాన్ని విక్రయించి పలు చోట్ల నిల్వలు చేసి మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు ఎక్కువ రేటుకు అమ్ముకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడో ఒక చోట బియ్యం రవాణా పట్టుబడగా పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టడంతో బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలంలోని ఆకినపల్లి, పిడిసిల్ల, ఇస్సిపేట, పర్లపల్లి, తదితర గ్రామాల్లో నిల్వలను ఏర్పాటు చేసుకొని రాత్రి సమయాల్లో వేరే గ్రామాలకు తరలిస్తున్నట్లు సమాచారం. పట్టపగలు, అర్ధరాత్రి వేళలో బియ్యాన్ని సేకరిస్తూ దర్జాగా అక్రమ వ్యాపారం చేస్తున్నారు.

కమీషన్లతో రవాణా..

బియ్యం దందా చేస్తున్న అక్రమార్కులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యవహారం నడిపిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో అధికారులకు ముందస్తు సమాచారం ఇస్తూనే ముడుపులు అందించి పక్క రాష్ట్రాలకు బియ్యాన్ని తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల అండదండలతో నడుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమాదారులతో చేతులు కలుపుతున్న అధికారులు మామూలు మత్తులో అక్రమార్కులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ నియమ నింబంధనలకు నీళ్లొదులుతోన్నారు. దీంతో అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

4నుంచి శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో ఈనెల 4వ తేదీన నుంచి 7వ తేదీ వరకు శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పున్నం సంపత్ శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలోని పురాతన శివాలయాన్ని దాతల సహకారంతో పునఃనిర్మించుకోవడం జరిగిందన్నారు. 4న గణపతి పూజ, పుణ్యహవాచనం, 5న యాగశాల, అంకురారోపణం, ధ్వజారోహనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6న నూతన ప్రతిష్ఠామూర్తుల అభిషేకాలు, జలాధివాసం, నవగ్రహ రుద్రహోమం, సామూహిక కుంకుమార్చనలు ఉంటాయన్నారు. 7న ఉదయం 8.49 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠతో పాటు దిష్టి కుంభం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అంకూస్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, సదాశివుడు, కైలాష్, రాజు, రమేష్, రవీందర్, రాజ్‌కుమార్, రజినీకాంత్, బాబురావు, శ్రీధర్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్య ఆశయాలను కొనసాగించాలి



కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మదన్‌కుమార్

నర్సంపేట: తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ఆశయాలను కొనసాగించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండాల మదన్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పోలీస్ కృష్ణయ్య 14వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మదన్‌కుమార్ మాట్లాడారు. రానున్న బహుజన రాజ్యంలో పోలీస్ కృష్ణయ్య కుటుంబానికి తగిన గౌరవం కల్పిస్తామని, సహాయం అందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రాణత్యాగం చేసిన అమరుడు పోలీస్ కిష్టయ్య అని కొనియాడారు. తన త్యాగాన్ని ప్రజలు మరిచిపోరని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు బుర్రి సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేశ్, మహిళా కన్వీనర్ గాదం స్వప్న యాదవ్, నాయకులు ఒంటేరు రాములు, తనువుల శ్రీకాంత్, వెండి కుమార్, నగేశ్, లక్క స్వామి, బస్సు అశోక్, మాధవి, భారతి, రాకేశ్, క్రాంతి, ముద్రబోయిన రాజుతో పాటు ఆపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో నిలువు దోపిడీ

- తూకంలో మోసం చేశారని రైతుల ఆందోళన



మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

రఘునాథపల్లి: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట.. విక్రయించాలంటే తమకు అడుగడుగునా మోసాలు జరుగుతున్నాయని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేసిన సంఘటన మండలంలోని కుసుంబాయితండాలో శుక్రవారం చోటు చేసుకుంది. కంచనపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల కుసుంబాయితండా శివారులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నుంచి నిర్వాహకులు ఇప్పటికే 23 లారీల ధాన్యం కొనుగోలు చేసి జాఫర్‌గూడెం మిల్లుకు తరలించారు. ఒక్కో బస్తా 41 కేజీలతో తూకం వేస్తున్నారు. ఓ రైతు తన బరువును తూకం వేసుకోగా రెండు కేజీలు తక్కువ చూపుతుండటంతో అనుమానం వచ్చిన రైతులు మరో కాంటాను తీసుకవచ్చి 41 కేజీల బస్తాను తూకం వేయగా రెండు కిలోలు అదనంగా 43 కేజీలు రావడంతో వారి మోసం వెలుగు చూసింది. సమాచారం తెలుసుకున్న చుట్టు పక్కల గ్రామాల రైతులు తమను మోసం చేశారని కేంద్రం వద్దకు చేరుకొని నిర్వాహకులతో వాగ్వావాదానికి దిగారు. మిల్లు వద్దకు వెళ్లి విక్రయించిన అక్కడి బస్తాలను తూకం వేయగా 41 కేజీల బస్తాకు 2 కేజీల వ్యత్యాసం రావడంతో ఆందోళనకు దిగారు. లారీకి 10 క్వింటాళ్లకు పైగా అదనంగా దోచు కున్నారని మండిపడ్డారు. ఒక్కో లారీలో 41 కేజీల బస్తాలు 576 బస్తాలు పంపగా తూకంలో 595 బస్తాలు వచ్చాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో రైతులను నిలువు దోపిడి చేశారని మండిపడ్డారు. మిల్లు వద్ద అదనంగా దోచుకున్న ధాన్యానికి డబ్బులు చెల్లించాలని ఆందోళనకు దిగారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని శాంతింప జేసి ఆందోళన విరమింపజేశారు. ఈ విషయమై నిర్వాహకులను సంప్రదించగా స్పందించలేదు.

వరి కొయ్యలను కాలిస్తే నష్టాలు తప్పవు



రైతులతో మాట్లాడుతున్న భాస్కర్‌రావు

రాయపర్తి: వరికొయ్యలను కాలిస్తే నష్టాలు తప్పవని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్ర శివారులోని పంట పొలాల్లోని వరి కొయ్యలను కొందరు రైతులు కాల్చుతుండగా ఆయన అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వరికొయ్యలను నేల సంపదగా అభివర్ణించారు. కొయ్యలను కాల్చితే భూమిలోని ఖనిజాలు, లవణాలు దెబ్బతిని భూసారం కోల్పోతుందని తెలిపారు. రెండు, మూడు పంటలు తీశాక వరికొయ్యలను కాల్చితే పంటల దిగుబడి రాకుండా చవిటి నేలలుగా మారిపోతాయని చెప్పారు. లవణాల సాంద్రత పెరుగుతుందని, ఖనిజాలు లేని భూమిగా మారుతుందని అన్నారు. నేల, వాయు కాలుష్యం తోపాటు సదరు భూముల్లో భవిష్యత్తులో పంటలు పండవని తెలిపారు. కొయ్యలను కాల్చడానికి ప్రత్యామ్నాయంగా పంట పొలాల్లోనే నీరుపెట్టి కుళ్లిపోయేలా చేయాలని, తదనంతరం సూపర్‌ఫాస్ట్ చల్లితే గడ్డి త్వరగా కుళ్లిపోయి భూమికి జవసత్వాలు, సహజమైన ఎరువులు అందుతాయని చెప్పారు.

రాములోరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- రెడ్యాలలో నేడు ద్వారతోరణ, ధ్వజస్తంభ ఆరాధన, పూర్ణాహుతి
- రేపు శ్రీసీతారాముల కల్యాణం



విశేష అలంకరణలో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామివారు

మహబూబాబాద్ రూరల్ : శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళశాసనములతో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని రెడ్యాలలో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, విజయకాంత్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో మొదటి రోజు సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోపణ పూజలు జరిపి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి యాగశాలలో ద్వారతోరణ, ధ్వజస్తంభ ఆరాధన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర యజ్ఞం, పూర్ణాహుతి, బలిహరణ పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని, సోమవారం ఉదయం యాగశాలలో మహా సుదర్శన యాగము, మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనం, చక్రస్నానం, మహా కుంభప్రోక్షణ, ఋత్విక్ సన్మానము, ఆశీర్వచనము, ఉత్సవ సమాప్తి జరుగుతుందని తెలిపారు. రెడ్యాల గ్రామంలోని ప్రజలందరిని అనుగ్రహించడానికి శ్రీసీతారామచంద్రస్వామి వారు గ్రామంలోకి విచ్చేసి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ప్రతిష్ఠ రోజును పురస్కరించుకుని నాలుగు రోజులు ఉత్సవాలు జరపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆలయంలో వార్షికోత్సవ పూజలు



ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

గూడూరు : స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి నేటికి 13 వసంతాలు నిండుకొని, 14వ సంవత్సరంలోకి మొదలైంది. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆశీష్‌పాండ్యే, సతీష్‌పాండ్యే ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. 6 గంటల నుంచి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన భక్తులచే సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేయించి, అర్చన పూజలు చేశారు. అనంతరం గొల్లగూడెంకు చెందిన చీర భిక్షపతి దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చెన్నబోయిన ఉప్పలయ్య, యాదగిరి, బాబూరావు, సాయిలు, శ్రీనివాస్‌గుప్త ఏర్పాట్లు చేశారు.

శ్వేతార్కలో సుదర్శన నర్సింహ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు శుక్రవారం సుదర్శన నర్సింహ హోమం నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు హోమం జరిపించారు. కార్యక్రమంలో సాయికృష్ణ శర్మ, ఆనంద్ త్రిపాఠి, హర్షిత్ త్రిపాఠి, శివం శుక్ల, హరిస్వామి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది

దోర్నకల్: మండలంలోని తహసీల్‌దారు బంజర గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నేహ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సిబ్బంది ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ రాధ, వీఏఓ అధ్యక్షురాలు వీరలక్ష్మి, కేంద్రం ఇన్‌చార్జ్ నల్లబెల్లి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

నెక్కొండ: మండలంలోని గొట్లకొండకు చెందిన మాలోతు స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్వామి చిన్ననాటి మిత్రులు శుక్రవారం రూ.50 వేల సాయం అందించారు. స్వామితోపాటు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2004–05 విద్యాసవత్సరంలో చదువుకున్న మిత్రులు తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్వామి భార్య పద్మకు రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్వామి మిత్రులు ప్రసాద్, రఘుమోహన్, శ్రీను, రమేశ్, రాజశేఖర్, రవి, రంజిత్, ఆళ్వార్, అశోక్, వెంకటేశ్, సృజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.